ఫ్లైఓవర్ ప్రారంభానికి రావాలని నితిన్ గడ్కరీని కోరుతా..

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



అంబర్‌పేట: అంబర్‌పేటలో నిర్మించిన ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరుతానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరితోనే అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణంలోనే జాప్యం జరిగిందని ఆయన ఆరోపించారు. ఫ్లైఓవర్ కోసం కావాల్సిన భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతని అన్నారు. కొన్ని చోట్ల అక్రమ ప్రార్థన మందిరాలు రాత్రికి రాత్రే ఏర్పాటు చేసి రోడ్డు విస్తారణను అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. త్వరలో ఫ్లైఓవర్ ప్రారంభించేందుకు చొరవ తీసుకుంటానని తెలిపారు. శుక్రవారం అంబర్‌పేటలో ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమం అనంతరం ఆయన ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంపై పై విధంగా స్పందించారు.

వీధి దీపాలకు మరమ్మతులు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని గంగపుత్రకాలనీలో వెలగని వీధి దీపాలకు శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు పూస గోరక్‌నాథ్ అధికారులను కలిసి ఎంసీహెచ్ కాలనీ, బాపూజీనగర్, చేపల మార్కెట్ వీధి, మోహన్‌నగర్,ఫ్రెండ్స్ కాలనీలో విద్యుత్ దీపాలు వెలగడం లేదని ఫిర్యాదు చేశారు. వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టి కాలనీ, బస్తీల్లో అంధకారం లేకుండా చూడాలని కోరారు.

'చేతనా శిల్పం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా.నిత్యానందారావు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రముఖ రచయిత ధూళిపాక అరుణ రచించిన చేతనా శిల్పం పుస్తకావిష్కరణ శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. మూసీ సాహిత్య ధార, తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగు విశ్వవిద్యాలయం వీసీ డా. నిత్యానందారావు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సమాజాన్ని చైతన్య పరిచే ఇలాంటి పుస్తకాలు రచించడం అభినందనీయమని అన్నారు. కవిత్వ సృజనలో అత్యంత ప్రతిభను కనబర్చుతూ రచన చేశారన్నారు. పాఠకులను చదివించే విధంగా అరుణ పుస్తకాన్ని రచించారని అభినందించారు. ప్రముఖ కవి దాస్యం సేనాధిపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు, తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల శాఖ అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు, ప్రముఖ కవి డా. రూప్‌కుమార్ డబ్బీకార్, రచయిత్రి డా. కొండపల్లి నిహారిక, కవయిత్రి గడ్డం సులోచన తదితరులు పాల్గొని ప్రసంగించారు.

హెబ్రోన్ చర్చి వద్ద భారీ బందోబస్తు

చిక్కడపల్లి: ప్రఖ్యాత గాంచిన గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోను చర్చి వద్ద శుక్రవారం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం చర్చికి సంబంధించిన రెండు గ్రూపుల మధ్య నెలకొన్న వివాదం వల్ల గురువారం సాయంత్రం ఉద్రిక్తత నెలకొంది. ఈ నేపథ్యంలో శుక్రవారం చిక్కడపల్లి డివిజన్ ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్, చిక్కడపల్లి సీఐ రాజునాయక్ పర్యవేక్షణలో చర్చి వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

28న గాయకుల ఎంపిక

పంజగుట్ట: చరిత్రాత్మికంగా 243 చరణాలతో రచించిన 'నూరేండ్ల నా ఊరు' గేయ కావ్యాన్ని 243 గాయకులతో ఆలపించనున్న నేపథ్యంలో గాయనీ, గాయకులను ఈ నెల 28వ తేదీన రవీంద్రభారతిలో ఎంపిక చేయనున్నట్లు గేయ రచయిత, ప్రముఖ కవి, ప్రజా గాయకుడు, సంగీత దర్శకు లు వరంగల్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్లె మాధుర్యాన్ని ప్రస్తుత తరానికి, రాబోయే తరానికి వివరించేందుకే ఈ 243 చరణాలు ఉన్న గేయాన్ని రచించినట్లు తెలిపారు.

ఈనెల 30వ తేదీన భామా కలాపం నృత్య ప్రదర్శన



చిక్కడపల్లి: సురస అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కల్చరల్, నవ్యనాటక సమితిల సంయుక్త ఆధ్వర్యంలో భామా కలాపం నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నామని నిర్వహణ సంస్థల ప్రతినిధులు సమీర్ కులకర్ణి, సుధామాల తెలిపారు. చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో శుక్రవారం నృత్య ప్రదర్శన వాల్‌పోస్టర్‌ను కేంద్ర సంగీత నాటక అకాడమీ బిస్మిల్లాఖాన్, వేదాతం సత్యనరసింహశాస్త్రి ఆవిష్కరించారు. ఈనెల 30న రవీంద్రభారతిలో సాయంత్రం 5.30గంటలకు నృత్య ప్రదర్శన ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నృత్య కళాకారిణులు మధుమతి కులకర్ణి, రాజశ్రీ హొళ్ల, సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ పాల్గొన్నారు.

బడుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సీపీఎల్ స్కూల్‌లో బెంచీలను పరిశీలిస్తూ..



లంకబస్తీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని గోల్నాక లంకబస్తీలోని ప్రభుత్వ పాఠశాల, అంబర్‌పేట డివిజన్ సీపీఎల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఫర్నిచర్‌ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటు, మరుగుదొడ్ల శుభ్రత కోసం యంత్రాలను దశలవారీగా అందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానం దేశ భవిష్యత్‌కు మేలు చేసేలా ఉంటుందన్నారు. కాలం చెల్లిన విద్యా విధానానికి కేంద్ర ప్రభుత్వం స్వస్తి చెప్పిందని తెలిపారు. ప్రస్తుతం నూతన విద్యా విధానం దేశంలో కొన్ని ప్రాంతాలోనే అమలు చేస్తున్నమని దశలవారీగా దేశం మొత్తం అమలయ్యేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేలా బోధనలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, మాజీ మంత్రి కృష్ణయాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, కార్పొరేటర్ ఉమారాణి, రమేష్ యాదవ్, భూషణ్‌చారి, మాజీ కార్పొరేటర్ వనం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ మృతుల కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

మృతుల తల్లిదండ్రులను పరామర్శించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మృతులు ధనుష్, లోహిత్‌ల తల్లిదండ్రులను పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ముషీరాబాద్: సిద్దిపేటలోని కొండపొచమ్మ జలాశయంలో మృతి చెందిన అన్నదమ్ములు ధనూష్, లోహిత్ మృతికి ప్రభుత్వం బాధ్యత వహిస్తూ వారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్‌లో ఇటీవల సిద్దిపేటలోని కొండపొచమ్మ జలాశయంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన అన్నదమ్ములు ధనూష్, లోహిత్‌ల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులు నర్సింగ్‌రావు, జ్యోతిలను కిషన్‌రెడ్డి పరామర్శించారు. వారి కుటుంబ వివరాలు, ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబానికి చెందిన ఇద్దరు సోదరులు మృతి చెందడం బాధాకరమని అన్నారు. వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. తాము ఆర్థికంగా బలంగా లేమని.. చేతికొచ్చిన కొడుకులిద్దరూ తమను వదిలేసిపోయారని మృతుల తల్లిదండ్రులు బోరున విలపించారు. కేంద్రమంత్రి వారిని ఓదార్చారు. సొంత ఇల్లు కూడా లేదని.. ఉద్యోగం, ఇల్లు ఇప్పించాలని వారు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

మైనార్టీ మోర్చా ఇమ్రాన్ కుటుంబీకులకు పరామర్శ..

అనంతరం మైనార్టీ మోర్చా మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్ హుస్సేన్ గుండెపోటుతో మృతి చెందడంతో కేంద్రమంత్రి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రవిచారి, బీజేపీ నాయకులు నందగిరి నర్సింహ, పూస రాజు, రమేష్‌రాం, రాజశేఖర్, ఆర్.విశ్వం, బిజ్జి కనకేష్‌కుమార్, చంద్రమోహన్, కృష్ణ, సత్యనారాయణ, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోరక్ష చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



గోవులకు పశుగ్రాసం అందజేస్తున్న మహేష్ అగర్వాల్

కాచిగూడ: గోరక్షా చట్టాన్ని పూర్తిగా అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. జాతీయ పశు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం గోశాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాత్యాయని గోశాలలో పశువులకు దాన పంపిణీ చేశారు. అనంతరం కాచిగూడలోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువుల అక్రమ రవాణాపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించి గోరక్ష చట్టాన్ని సమర్థవంతగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గో ఆధారిత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలని కోరారు. గో ఆధారిత ఉత్పత్తులలో ఆసక్తిగల గోశాలల నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ప్రేమ్‌చంద్ మునోత్, కాత్యాయని గోశాల ప్రతినిధులు ఎ.మనోహర్ రాజు, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



సంవిధాన్ గౌరవ్ అభ్యాస్ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో బీజేపీ నాయకులు

చిక్కడపల్లి: డా. బీఆర్. అంబేడ్కర్ మేథో సంపదను.. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్‌లోని అభ్యుదయ హైస్కూల్ విద్యాసంస్థలో 'సంవిధాన్ గౌరవ్ అభ్యాస్'కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కుతో పాటు రాజకీయ సమానత్వం ఇవ్వడానికి అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, వీఎస్టీ రాజు, పి.నర్సింగ్‌రావు, సత్తిరెడ్డి, చామర్తి వాణీశ్వరశాస్త్రి, సురేష్, శ్రీనివాస్, నరిసంహ, సాయికుమార్, సత్యేందర్, నీరజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డా. అచ్యుతాదేవికి జాతీయ ఐక్యత పురస్కారం



డా.అచ్యుతాదేవికి పురస్కారం అందజేస్తున్న ఓయూ వీసీ ప్రొ.ఎం.కుమార్

కాచిగూడ: నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపల్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ జె.అచ్యుతాదేవి జాతీయ ఐక్యత పురస్కారం అందుకున్నారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఓయూ వీసీ ప్రొ. ఎం.కుమార్ ఆమెకు పురస్కారం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అచ్యుతాదేవికి శుక్రవారం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సామాజిక న్యాయానికి మారుపేరు కర్పూరి ఠాగూర్



కర్పూరి ఠాగూర్‌కు నివాళులర్పిస్తున్న బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సామాజిక న్యాయానికి మారుపేరు కర్పూరి ఠాగూర్ అని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. సామాజిక న్యాయం కోసం పోరాటం కేవలం నినాదం కాదని, ఇది బలహీన వర్గాల జీవన విధానమని ఆనాడే కర్పూరి ఠాగూర్ అన్నారని గుర్తు చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని రాజ్యాధికార సమితి కార్యాలయంలో కర్పూరి ఠాగూర్ 101వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దాసు సురేష్ మాట్లాడుతూ... బిహార్ ముఖ్యమంత్రిగా కర్పూరి ఠాగూర్ 1978లో తన ప్రభుత్వంలో విద్యా ఉద్యోగాలలో 26శాతం రిజర్వేషన్ కల్పించడం ఆయన దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. అట్టడుగు వర్గాలకు అధికార వికేంద్రీకరణ జరిగితేనే భారత దేశ నిర్మాణం బలంగా జరుగుతుందన్నారు. ఆ దిశగా బీసీలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి మార్గదర్శకులు వీజీఆర్ నారగోని, గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు బండారు పద్మావతి, దుర్గేష్, కిషోర్, నరేష్, కరుణాకర్, రాధికా, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల కేంద్రంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలి

- ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు
- 9న వరంగల్‌లో తెలంగాణ జానపద జాతర

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వరంగల్‌లో తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేందుకు ఫిబ్రవరి 9న తెలంగాణ జానపద జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సినిమా, టీవీ జానపద కళల వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వేదిక సినిమా రంగంలోని పెద్ద హీరోల గుత్తాధిపత్యంపై సవాలు చేయనుందన్నారు. సినిమా, టీవీ కళాకారుల కేంద్రంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ నుంచి జానపద అకాడమీని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. జానపద కళాకారుల సంక్షేమం కోసం రూ.500 కోట్లు కేటాయించాలని కోరారు. ఈ సదస్సుకు 12మందితో జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు.



జానపద కళల వేదిక సమావేశంలో మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు

నేడు దక్కన్ బ్రాహ్మ సమాజ మందిరం శతాబ్ది ఉత్సవాలు

కాచిగూడ: దక్కన్ బ్రాహ్మ సమాజ మందిరం శతాబ్ది ఉత్సవాలను ఈ నెల 25వ తేదీన హనుమాన్ టేకిడి బ్రహ్మ మందిరంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు కేశవ చంద్, కార్యదర్శి అజయ్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శతాబ్ది ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హైకోర్టు సీనియర్ అడ్వొకేట్ డాక్టర్ యార్లగడ్డ పద్మావతి, బ్రహ్మణ సమాజ్ సీనియర్ సభ్యులు సి.మదన్‌మోహన్, వేమ శ్రావ్య, అభిప్రకాష్, బ్రాహ్మణ సమాజ్ ఆచార్యులు బందా రవిశంకర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఇటీవల నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల కోసం బ్రహ్మ సమాజం నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం ఉంటుందని వారు తెలిపారు.

ఆరాధన సంగీత ఉత్సవాలకు విశేష ఆదరణ

నల్లకుంట: శ్రీరామ గానసభ ఆధ్వర్యంలో న్యూనల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో త్యాగరాజు స్వామి ఆరాధన సంగీతోత్సవాలు సంగీత అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సాయంత్రం మల్లెల సుబ్రహ్మణ్యం, పాలపర్తి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ వేణుగాన విద్వాంసుడు విశ్వేశ్వర్ బృందం వేణుగాన ప్రదర్శన, పెరవలి లలిత వయోలిన్ కచేరి, హర్షిత మృదంగ వాద్యం ఆకట్టుకుంది. అనంతరం ద్వి సహస్రావధాని, మహాకవి బ్రహ్మశ్రీ నాగఫణి శర్మ త్యాగరాజుస్వామిని కీర్తిస్తూ ఆధ్యాత్మిక ప్రసంగం ఇచ్చారు.

తొమ్మిదేళ్లలో 13వేల మందికి ఉచిత శిక్షణ ఇచ్చాం

నియోకర్సర్ డైరెక్టర్ బొజ్జ భిక్షమయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యే లక్ష్యంగా ముందుకు సాగాలని నియోకర్సర్ డైరెక్టర్ బొజ్జ భిక్షమయ్య అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నియోకర్సర్ 9వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా భిక్షమయ్య మాట్లాడుతూ... తమ సంస్థ తొమ్మిదేళ్ల కాలంలో 13వేల మంది విద్యార్థులకు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు 4500 మందికి ఉద్యోగాలు ఇప్పించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. ఈ కార్యక్రమంలో నియోకర్సర్ కార్యదర్శి జగదీష్ కుమార్, ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, ఆర్.విఠలాచారి, శ్యామలాదేవి, కె.రాజయ్య, నియోకర్సర్ ప్రతినిధులు రాణాప్రతాప్ సింగ్, ఇందిరా, సాత్వికా, భవాని, వైష్ణవి, సుష్మా, మేఘన తదితరులు పాల్గొన్నారు.

టీబీఎస్ఎంఏ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

కాచిగూడ: తెలంగాణ బడ్జెట్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీబీఎస్ఎంఏ) రాష్ట్ర కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీపతి శేఖర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా జగ్గు మల్లారెడ్డి, కోశాధికారిగా జె.శ్రీనివాస్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గుజ్జ సత్యం, షేక్ షరీఫ్, కె.దయాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.జలంధర్‌రెడ్డి, సలహాదారులుగా రాధాకృష్ణ, టి.బుచ్చిరెడ్డిని ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అభినందించారు.

కేంద్రం గిట్టుబాటు ధరల చట్టం అమలు చేయడం లేదు

చిక్కడపల్లి: కేంద్రంలో నరేంద్రమోదీ సర్కార్ రైతాంగానికి గిట్టుబాటు ధరల చట్టాన్ని అమలు చేయడం లేదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆరోపించారు. అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఇచ్చిన పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రాలలో శనివారం నుంచి ట్రాక్టర్ ర్యాలీలు ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా చేయాలని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు ప్రొ. ప్రసాదరావు, సహాయ కార్యదర్శి శోభన్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ, ప్రసాద్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్‌ను సన్మానిస్తున్న బిజ్జి కనకేష్‌కుమార్ తదితరులు

ముషీరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ కార్యాలయంలో డివిజన్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బిజ్జి కనకేష్ మాట్లాడుతూ.. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నేతలు ప్రజా సమస్యలపై పోరాడుతూ వారికి అండగా నిలవాలన్నారు. అప్పుడే పార్టీకి, నేతలకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.విశ్వం, దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నందగిరి నర్సింహ, సెన్సార్‌బోర్డు సభ్యులు చంద్రమోహన్, దళిత మోర్చా నగర ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు రవికుమార్, మహేష్, సత్యనారాయణ, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చే ఆయుధం 'విద్య'



జవహర్‌నగర్‌లో పిల్లలకు పౌష్టికాహారం, బుక్స్‌ను పంపిణీ చేస్తున్న డా. పద్మాకమలాకర్

చిక్కడపల్లి: అంతర్జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జవహర్‌నగర్ స్లమ్‌లో పిల్లలకు పౌష్టికాహారం, నోట్‌బుక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. పద్మాకమలాకర్ మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో మార్పుల అవసరమన్నారు. చదువు జీవితం పట్ల ఆశావహ దృక్పథాన్ని.. విజ్ఞానాన్ని పెంపొందించేలా ఉండాలన్నారు. ఆచరణ సాధ్యం కాని బోధనా విధానాలు విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య సమాజాన్ని మార్చగల శక్తివంతమైన ఆయుధమని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి టీఆర్ శోభారాణి, ప్రతినిధులు ప్రభావతి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సమాన హక్కుల కల్పనకు ప్రభుత్వాలు కృషి చేయాలి

ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొ. ఇటికాల పురుషోత్తం



మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొ.ఇటికాల పురుషోత్తం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భారత రాజ్యాంగ ఫలాలను అందిపుచ్చుకునేలా ప్రజలు చైతన్యవంతులు అయినప్పుడే సామాజిక సాధికారత లభిస్తుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొ. ఇటికాల పురుషోత్తం అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పూలే - అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ ప్రజా పర్యవేక్షణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం - సామాజిక సాధికారత'అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం మాట్లాడుతూ... ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. రాజ్యాంగం భావ ప్రకటన స్వేచ్ఛ, సమానత్వ హక్కులను కల్పించిందని వీటి పట్ల ప్రజలకు అవగాహన లేకపోవడం వల్ల వివక్షతకు గురవుతున్నారని అన్నారు. ఈ సంస్థల ఆధ్వర్యంలో 60 రోజులపాటు రాజ్యాంగ ప్రచారోద్యమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పీపుల్స్ మానిటరింగ్ కమిటీ జాతీయ కన్వీనర్ సత్యబాబు బోస్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ కృషి ఫలితంగా భారత రాజ్యాంగంలో అనేక అధికరణలు పొందు పరిచారని అందులో భాగమే పౌరహక్కుల చట్టమని అన్నారు. పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సురుపంగ శివలింగం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రచయిత డాక్టర్ జిలకర శ్రీనివాస్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు, గిరిజన సంఘం కార్యదర్శి శ్రీరాంనాయక్, వివిద సంఘాల నాయకులు నర్సింహ, బత్తుల రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

కాచిగూడ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని లేని పక్షంలో ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ హెచ్చరించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తీర్ణత సాధించినా కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువులు మానుకుని పనులకు వెళ్తున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలన్నారు.

సంస్కృతికి ప్రతిబింబాలు.. రంగవల్లులు

కాచిగూడ: హరివిల్లును తలపించే రంగులు... మగువ చే జారిన 'చుక్కల'వెలుగులు... నయన మనోహరమైన ముగ్గుల సోయగాలతో సంక్రాంతి లక్ష్మీ సందడి చేసింది. వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సామాజిక విభాగం, పద్మశాలి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు రూపాసదాశివ్ ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు జరిగాయి. నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలకు మంచి స్పందన లభించింది. యువతులు, మహిళలు, వృద్ధులు తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను మేళవిస్తూ రంగవల్లులు తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ బల్రెంకల మధుసూదన్, పద్మశాలి మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు వనం దుశ్యంతల విశ్వనాథం, గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు శారదాప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో జరిగిన పోటీల్లో ముగ్గులు వేస్తున్న మగువలు